వీధి దీపాలకు మరమ్మతులు



జగద్గిరిగుట్ట: కాలనీల్లోని కొన్ని వీధి లైట్లు వెలగడం లేదని పలువురు ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించారు. చింతల్ పద్మానగర్ ఫేస్-1లోని రోడ్డు నంబర్ 2,4,6,7 లో గల స్ట్రీట్ లైట్లకు సిబ్బంది గురువారం మరమ్మతులు చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

జగద్గిరిగుట్ట: లయన్స్ క్లబ్ చింతల్ ఆధ్వర్యంలో నెక్స్ జెన్ హాస్పిటల్ వారు చింతల్, శ్రీసాయికాలనీలోని అభయాంజనేయ, పోచమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి డయాబెటిక్ పరీక్షలు, మెడివిజన్ ఐ హాస్పిటల్ వారు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు.

రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలి

శామీర్‌పేట్: మూడుచింతలపల్లిలోని బీటీ రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఎంపీ ఈటల రాజేందర్‌కు బీజేపీ నేత నరేందర్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పోతారం నుంచి అనంతారం రోడ్డు మీదుగా వివిధ గ్రామాలకు వెళ్లేందుకు ఈ రోడ్డే ప్రధానమైందని, ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పోతారం రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని ఎంపీ ఈటలను కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, కార్యవర్గసభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రవీందర్‌రెడ్డి, సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి, రత్నాల రవి, మచ్చేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండలం సమతానగర్‌కు చెందిన ఉప్పు విజయ్‌కుమార్ పటేల్ తెలంగాణ రాష్ట్ర బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య నియామక ఉత్తర్వులు జారీ చేశారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో నియమించిన ఆర్. కృష్ణయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్, బీసీ యువజన సంఘం రాజ్‌కుమార్ సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

శామీర్‌పేట్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ.. లక్ష్యాన్ని చేరుకోవాలని శామీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపాలిటీలోని జగ్గంగూడ జీనియస్ గ్రామర్‌స్కూల్‌లో నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ జోనల్‌స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. గత మూడ్రోజులుగా నిర్వహించిన శామీర్‌పేట్ జోనల్ స్థాయి క్రీడా పోటీలైన వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలను ఎస్‌జిఎఫ్ జోనల్ క్రీడల కార్యదర్శి సత్తిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలైన జట్లకు శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎంఈఓ కమలాకర్, ఎస్సై సోమిరెడ్డి, ఉద్దెమర్రి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం. ప్రభాకర్‌లు బహుమతులను ప్రదానం చేశారు.

మహిళ అదృశ్యం



కనుమూరి మహాలక్ష్మి

ఘట్‌కేసర్: ఓ మహిళ అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ లింగస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్, రాజమండ్రి నిడదవోలు గ్రామానికి చెందిన కనుమూరి మహాలక్ష్మి (43) 3 నెలల క్రితం ఓ మ్యారేజ్ బ్యూరో ద్వారా ఘట్‌కేసర్ పట్టణానికి చెందిన కడమంచి యాదగిరిని రెండో వివాహం చేసుకుంది. అప్పటి నుంచి ఎన్ఎఫ్‌సీనగర్‌లో భర్తతో కలిసి ఉంటోంది. కాగా మేడిపల్లిలోనిఓ రోల్డ్ గోల్డ్ కంపెనీలో పనిచేస్తున్నానని చెబుతూ.. 15 రోజులుగా ఇంటి నుంచి వెళ్తుంది. సోమవారం ఉదయం పనికోసం వెళ్లిన ఆమె సాయంత్రం 5 గంటలకు ఇంటికి వస్తున్నట్లు ఫోన్‌లో మాట్లాడింది. కానీ రాత్రైనా తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో భర్త తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె పనిచేస్తున్న చోట ఆరా తీయగా.. ఉద్యోగం చేయడం లేదని తేలింది. భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గణనాథులకు ఘనంగా పూజలు

గణేశ్ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆయా ప్రాంతాల్లోని మండపాల్లో గణనాథులు ఘనంగా పూజలందుకుంటున్నారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు.. అన్నదానాలు..లడ్డూల వేలం నిర్వహించారు. మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– కుత్బుల్లాపూర్



వినాయకుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, వివేకానంద్



బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌లో పూజల్లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్..



త్రిశూల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూజల్లో ఎంపీ ఈటల రాజేందర్



గుడెన్‌మెట్‌లో పూజలు..



ఎన్‌సీఎల్ నార్త్ కాలనీ ప్లేస్‌మెంట్ వ్యాలీలో..



సంజయ్‌గాంధీనగర్‌లో ..



సూరారంకాలనీ శ్రీరామ్‌నగర్‌లో..

నిమజ్జనానికి ఇబ్బందుల్లేకుండా చూడాలి

కుత్బుల్లాపూర్: గణేశ్ నిమజ్జనానికి ఇబ్బందుల్లేకుండా చూడాలని కొంపల్లి మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీశ్‌సాగర్ అన్నారు. కొంపల్లి చెరువు వద్ద ఏర్పాట్లను భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కన్వీనర్ శివాజీ రాజుతో కలిసి గురువారం పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. గణేశ్ ఉత్సవ సమితి కోకన్వీనర్ మహేందర్ సాగర్, మధు, మున్సిపల్ సిబ్బంది అభిలాష్ తదితరులు ఉన్నారు..



కొంపల్లి చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న శివాజీ రాజు, సతీశ్‌సాగర్

బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల ధర్నా



డిపో ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

మేడ్చల్: కళాశాలల సమయాల్లో బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ.. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మేడ్చల్ బస్‌డిపో ఎదుట విద్యార్థులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ.. గ్రామాల నుంచి మేడ్చల్‌లో ఉన్న వివిధ కళాశాలలకు కళాశాల సమయాల్లో బస్సులు నడవకపోవడంతో విద్యార్థులు చదువుల్లో నష్టపోతున్నారన్నారు. ఉదయం కళాశాలల సమయాల్లో సాయంత్రం ఇంటికెళ్లే సమయాల్లో బస్సులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీ అధికారులు విద్యార్థుల సమయాల్లో బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. ఉదయం పూట బస్సులు ఆలస్యంగా రావడం వల్ల క్లాసులకు గైర్హాజరు కావాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సాయంత్రం బస్సులు లేకపోవడంతో గ్రామాలకు నడిచి వెళ్తున్నారని వాపోయారు. మేడ్చల్ డిపో మేనేజర్ విద్యార్థులతో మాట్లాడి పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు కార్తీక్, ప్రశాంత్, నాయకులు భగత్, శ్యామ్, కరుణాకర్, ఆకాశ్, బాలకిరణ్, సుధీర్, రాము, రాజు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

‘స్వయం స్వచ్ఛ’ కార్మికుల వివరాల సేకరణ

కీసర: వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని ఆర్‌జీకే కాలనీలో గురువారం స్పెషల్ ఆఫీసర్ పుష్పలత, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డిల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్‌జీకే కాలనీలో 'స్వయం స్వచ్ఛ' (చెత్తేరుకునే) కార్మికుల పూర్తి వివరాలు సేకరించారు. వారి వ్యక్తిగత వివరాలు, కుటుంబసభ్యుల సంఖ్య, విద్య, ఆరోగ్యం, భద్రత, సాధారణ వ్యాధులు, గాయాలు, వైద్య సౌకర్యాలు, రక్షణ, ఆదాయం, జీవనోపాధి, పొదుపు, అప్పులు, ప్రభుత్వ పథకాలు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో తడి, పొడి వ్యర్థాలు వేరు చేయడం, సీజనల్ వ్యాధులు, కంపోస్టింగ్‌పై అవగాహన, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. డీఈఈ బాలమురళి, మేనేజర్ వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, వార్డు ఆఫీసర్లు సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న స్పెషల్ ఆఫీసర్ పుష్పలత, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లి పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఏటీఎం భవనంలోని మెట్ల వద్ద ఓ వృద్ధుడు మృతి చెందాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయస్సు 60 ఏళ్లు ఉంటాయని కుడి చేతిపై రామ్ అనే పేరుతో పచ్చబొట్టు ఉందని పోలీసులు పేర్కొన్నారు. అనారోగ్య కారణాలతో చనిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ మేరకు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిట్టీల పేరుతో మోసం

సుమారు రూ.3 కోట్లతో పరారైన మహిళ

జవహర్‌నగర్: అమాయక ప్రజలను మోసం చేసి చిట్టీల పేరుతో ఓ మహిళ పరారైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ శాంతినగర్‌లో నివసించే మమత అలియాజ్ స్వప్న, గత 14 ఏళ్లుగా స్థానికంగా ఉంటూ.. చిట్టీల వ్యాపారం చేస్తుంది. చిట్టీలు ఎత్తుకున్న వారు ఆమెను డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేశారు. దాదాపు 200 మంది వద్ద సుమారు రూ.3 కోట్ల మేర డబ్బులు తీసుకుని పరారైందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై జవహర్‌నగర్ పోలీసులను వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

పీహెచ్‌డీ జాబితా విడుదల చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ సీట్లు సాధించిన విద్యార్థుల జాబితా విడుదల పై అధికారులు మౌనం వహిస్తున్నారు. జూలై 19న విడుదల కావాల్సిన జాబితాను ఇంత వరకు వెల్లడించలేదు. జాబితాను విడుదల చేయాలని విద్యార్థులు కోరగా వివిధ కారణాలను చూపుతూ రెండు నెలలుగా పెండింగ్‌లో పెట్టారు. జాబితా విడుదలకు అన్ని అడ్డంకులు తొలిగి, చివరకు డీన్లతో స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించిన తర్వాత కూడా జాబితాను వెల్లడించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వీసీ ప్రొ.కుమార్ వెంటనే స్పందించి జాబితాను విడుదల చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

కులవృత్తుల అభ్యున్నతికి కృషి

దుండిగల్: కుల వృత్తుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. దుండిగల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శాలీ వాహన(కుమ్మరి) సంఘం నాయకులు గురువారం ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని 100 కుటుంబాల వారు ఎన్నో ఏళ్లుగా కులవృత్తిని నమ్ముకునే జీవనోపాధి పొందుతున్నామన్నారు. గతంలో గ్రామంగా ఉన్న ప్రాంతం ప్రస్తుతం పట్టణంగా రూపాంతరం చెందిందని, దీంతో కుండలు తయారు చేసేందుకు, వాటిని ఎండబెట్టి వాములో పెట్టి కాల్చేందుకు స్థలాలు కరువయ్యారన్నారు. ప్రభుత్వం నుంచి రెండెకరాల స్థలం కేటాయించి తమ కులవృత్తి పరిరక్షణకు సహకరించాలని ఎంపీని కోరారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందిస్తూ రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు. కులసంఘం నాయకులు ఎలిజాల రాజయ్య, మల్లేశ్, రమేశ్, నాగభూషణం, కృష్ణ,రాజు, శివ, బద్రి తదితరులు ఉన్నారు.



ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసిన కుమ్మరి కుల సంఘం నాయకులు

బాధిత కుటుంబానికి అండగా ఉంటా



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: గణేశ్ నిమజ్జనంలో చెరువులో మునిగి ప్రాణాలు కోల్పోవడం బాధకరమని, ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఆటో చెరువులోకి దూసుకెళ్లి దుండిగల్ శ్రీనివాసకాలనీకి చెందిన డొక్కా శ్రీనివాస్, ఆయన కుమారుడు జాన్‌వెస్లీ మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. మాజీ కౌన్సిల్లోర్లు జక్కుల కృష్ణయాదవ్, గోపాల్ రెడ్డి, జక్కుల శ్రీనివాస్‌యాదవ్, ఆనంద్, పాక్స్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె రాజు తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం

ఓల్డ్ బోయిన్‌పల్లి: బోయిన్ చెరువు కట్టపై రూ. కోటి వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ హయాంలో ఈ చెరువు సుందరీకరణకు ప్రణాళికలు సిద్ధం చేశామని అందులో భాగంగానే కల్వర్టు నిర్మాణం, చెరువు సుందరీకరణ పనులను చేపడుతున్నామన్నారు. అనంతరం మహిళల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నిమజ్జనం ఏర్పాట్ల పరిశీలన

హస్మత్‌పేట బోయిన్ చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఎమ్మెల్యే కార్పొరేటర్‌తో కలిసి పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ గోవర్ధన్‌గౌడ్, డీఈ నిఖిల్‌రెడ్డి, ఏఈ ఆశా నాయకులు నరేందర్‌గౌడ్, మక్కాల నర్సింగ్‌రావు, సయ్యద్ ఏజాజ్, బల్‌రాజు, మక్కాల సత్యనారాయణ, ఖాదీర్, మేకల హరినాథ్, కర్రె జంగయ్య, మేకల హరినాథ్, పోచయ్య, రాజుగౌడ్, బండారు తిరుపతి, సరోజదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జిల్లాస్థాయి ‘కళా ఉత్సవం’



కళా ఉత్సవ్ విజేతలతో జిల్లా విద్యాధికారి విజయకుమారి

ఘట్‌కేసర్: సమగ్ర శిక్ష మేడ్చల్ జిల్లా స్థాయి కళా ఉత్సవం ఏదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యాధికారి విజయకుమారి సమక్షంలో 74 పాఠశాలల నుంచి 132 మంది విద్యార్థులు 12 అంశాల్లో పోటీ పడ్డారు. మొదటి, రెండో స్థానం సాధించిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. మండల విద్యాధికారి శ్రీధర్, ప్రిన్సిపాల్ రాము, జీసీడీఓ హేమలత, పద్మజ, జ్యూరీ సభ్యులు చైతన్య, కిషన్, ధర్మపాల్, వాసవీచౌదరి, రమ్యవేణి, సంతోష్‌కుమార్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

రంగారెడ్డినగర్: నందానగర్‌లోని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీసీసీ మాజీ చైర్మన్ కె.ఎం.ప్రతాప్ హాజరై ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు ఎస్.కావ్య, హరిచరణ్‌కు రూ.10 వేల చొప్పున నగదు పురస్కారాన్ని అందజేశారు. ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని, విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంతో ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ప్రేమావతి, ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ తదితరులు పాల్గొన్నారు.



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించిన సెయింట్ మార్టిన్స్ కళాశాల అధ్యాపకులు

సెయింట్ మార్టిన్స్‌లో..

సుభాష్‌నగర్: సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే.రవీంద్ర అధ్యాపకులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌యాదవ్, అకాడమిక్స్ డీన్ డాక్టర్ శివరామకృష్ణరాజు, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

నిజాంపేట్: పీఎంశ్రీ జడ్పీ పాఠశాల నిజాంపేట్‌లో గురువారం విద్యార్థులు ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను ఘనంగా శాలువాతో సత్కరించి, వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఇటీవలే గెజిటెడ్ హెచ్‌ఎం పదోన్నతిపై బదిలీ అయిన శ్రీలతను సన్మానించి వీడ్కోలు పలికారు. అదేవిధంగా పాఠశాలకు బదిలీ, ప్రమోషన్‌పై వచ్చిన టీచర్లు హవీళ, జాయ్‌లకు స్వాగతం పలికారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు రఘునాథ్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



విద్యార్థికి నగదు పురస్కారం అందజేస్తున్న కేఎం ప్రతాప్



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం